# బతుకు చిత్రం

రేణుక అయోల



"అక్కా... బావ పిలుస్తున్నాడు..." ఆయాస పడుతూ మేడమెట్లెక్కి వస్తూ చెప్పింది స్వప్న పిన్ని కూతురు లావణ్య.

"వస్తాను... నువ్వెళ్లు" అంటూ మళ్లీ ఆలోచనలో పడిపోయింది. ఎంత మరచిపోదామన్నా మరచిపోలేకపోతోంది. తన చిన్ననాటి స్నేహితురాలు, ఎంతో ఆత్మీయురాలూ చేసిన అవమానాన్ని తట్టుకోలేకపోతోంది.

చిన్నప్పటి నుంచీ చిత్రకళ అంటే చాలా అభిమానం. నేర్చుకోవడానికి ప్రయత్నించి రెండు మూడు కాన్వాసులమీద అతి కష్టం మీద మంచి బొమ్మలు వేసి, చిత్రకళని అభిమానించినంతగా వేయలేకపోతున్నానని తెలుసుకుంది. అయినా దాని మీద వున్న అభిరుచి, అభిమానం చంపుకోలేక ఏ ఆర్ట్ గేలరీలో చిత్రకళా ప్రదర్శన జరిగినా వెళ్లి, ఆత్రంగా చూసి వాటిల్లో మునిగిపోయేది. అలాగే ఎంతోమంది చిత్రకారులు పరిచయమయ్యారు. వారిని అభినందించడం, తన స్థితికి మించనిదైతే, నచ్చితే కొనడం... ఇలా ఇల్లంతా కళాఖండాలతో నింపేసుకుంది.

ఖరీదైన హాబీ అయినా, భర్త రమేష్ ఏమీ అనకుండా ప్రోత్సహించేవాడు.

"అక్కా... వస్తున్నావా" అంటూ ఇంకా అక్కడే తనతోపాటు నిలబడ్డ లావణ్యని చూసి కోపం వచ్చినా తమాయించుకుంది. తను వస్తే గానీ కదలదని అర్థమైపోయింది. పద... అంటూ కిందికి దిగింది స్వప్న.

తన కోసమే ఎదురు చూస్తున్న రమేష్ 'ఏమిటి స్వప్నా, నేను ఆఫీసు నుంచి వచ్చి గంట అయింది. తెలుసా?'... అన్నాడు.

"సారీ రమేష్! మేడ మీద ఆరవేసిన బట్టలు తెద్దామని వెళ్లాను"

"మరి బట్టలేవి?" అన్నాడు రమేష్

తెద్దామనుకొని వెళ్లి ఆలోచనలో పడి అలాగే వచ్చేసింది...

"ఏమిటిది స్వప్నా చిన్న పిల్లలాగా. ఇంకా నీ స్నేహితురాలి గురించి ఆలోచిస్తున్నావా?" అంటూ పనిపిల్లని పిలిచి "ముందు టీ పెట్టు. ఆ తరువాత డాబామీద బట్టలు తీసుకురా" అంటూ పురమాయించాడు.

"స్వప్నా నువ్విలా వుంటే చూడలేను. నిన్ను ఇంకో చోటకి తీసుకువెళదామని ఆఫీసు నుంచి తొందరగా వచ్చాను.

"నాకెక్కడికీ రావాలని లేదు" అంది స్వప్న...

"నా గురించి రావాలి" అంటూ భుజం మీద చెయ్యి వేసి దగ్గరగా లాక్కుంటూ అభిమానంగా అడిగేసరికి ఇంక ఆపుకోలేక ఏడ్చేసింది.

పనిపిల్ల తెచ్చిన టీ కప్పులని అందుకుంటూ... "ముందు వేడిగా టీ తాగు... అయినా ఇంత బేలతనమేమిటి?"

"చిన్నప్పటి స్నేహితురాలే కావచ్చు. పెద్దవాళ్లు అయ్యాక స్వభావాలు మారిపోతాయి. సమాజంలో ఎదగాలంటే ఎన్నో మార్గాలు. నువ్వెలా కాదనగలవు...?"

"అది కాదు రమేష్.. కళని కూడా వ్యాపార ధోరణిలో చూడాలా?"

"తప్పదు స్వప్నా... నలుగురి దృష్టినీ ఆకర్షించాలంటే. కళ వ్యాపారంగా మారిపోతోంది. అయితే అందరూ అలాంటి వాళ్లే ఉండరు. కొందరు పేరు ప్రఖ్యాతులకే ప్రాముఖ్యత ఇస్తారు. నీవంటివారు చూపించే అభిమానం. పొగడ్తల కన్నా వారికి డబ్బు విలువే ఎక్కువ. అందుకే నీ స్నేహితురాలు తన చిత్రాలను

ఎక్కువ మొత్తంతో కొంటున్న వ్యక్తి మీద శ్రద్ధ చూపించింది. నీ ఆప్యాయత కన్నా సమాజంలో పేరు ప్రఖ్యాతులు వున్న ఆవిడ కొంటున్నప్పుడు... వాటి ముందు నీ అభిమానం తేలిపోయింది... అయినా ఆదరణ కన్నా ప్రచారం ఎక్కువ ప్రాముఖ్యత సంతరించుకొన్న ఈ రోజుల్లో వచ్చే అవకాశాన్ని ఎవరు వదులుకుంటారు? ఇంక ఆ విషయాన్ని మరిచిపో... పద నీకు ఇష్టమైన మరోచోటుకి తీసుకు వెళతాను... తొందరగా రెడీఅయి రా...

"ప్లీజ్ నేను రాలేను రమేష్..."

"చూడు స్వప్నా! అందరూ నీ స్నేహితురాల్లా వుంటారనుకోవడం పొరపాటు. అయినా ఆవిడ కోసం నీకిష్టమైన, నువ్వు అభిమానించే చిత్రకళకి దూరం అవడం నా కిష్టంలేదు. నీలోవున్న మంచి ప్రోత్సహకురాలిని నాశనం చేసుకోకు. కళను ఆదరించే వారే కరువైన ఈ సమాజంలో అడపాతడపా కళాకారులకి నీలాంటి వాళ్ల ప్రశంస, అభిమానం అవసరం".

"నన్ను అనవసరంగా పొగుడుతున్నావ్"

"పొగడ్త కాదు స్వప్నా, ఇది నిజం. మన స్ఫూర్తిగా నచ్చిన దానిని నచ్చింది అని చెప్పడం, ఈ స్వార్థ ప్రపంచంలో చాలా అరుదు. ఒక పొగడ్త ఒక మంచి మాట నోటినుంచి వస్తే ఎక్కడ తమకన్నా ముందుకి వెళ్లిపోతారో, ఎదిగిపోతారో అని బెంగపడే సమాజంలో... నిజమైన ప్రశంస కరువైపోతోంది... సరేగానీ ముందు నువ్వు బయలుదేరు".

ఇంక బ్రతిమాలించుకోవడం ఇష్టం లేక పద... అంటూ చెప్పులేసుకుంది.

"చీర మార్చుకోవా?... అయినా ఫరవా లేదు ఇలావున్నా సింపుల్‌గా చాలా అందంగా వున్నావ్" అన్నాడు రమేష్.

రమేష్ మాటలకి చిన్నగా నవ్వుకుంటూ బైక్ మీద కూర్చుంది.

రమేష్ ఎంతా సర్దిచెప్పినా, స్నేహితురాలు చేసిన అవమానం జీర్ణించుకోలేకపోతుంది.

ఢిల్లీలో వున్న ఉష హైదరాబాద్‌లో "ఆర్ట్ గేలరీ"లో తన చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేస్తాను, 'నీ సహాయం' కావాలంటూ ఫోను చేసింది.

ఆ వార్త విన్న దగ్గర నుంచి చాలా ఆనంద పడిపోయింది. ఇద్దరూ స్కూలు దగ్గరనుంచి కాలేజి వరకూ ఒకేచోట చదువుకొని, అందరూ ఈర్ష్యపడేంత స్నేహంగా వుండేవారు. ఉషతో పాటు ప్రదర్శన మొదలయ్యేదాక ఎంతో శ్రమ పడింది.

ఉష వేసిన అన్ని చిత్రాలలో కన్నా తాంజార్ పెయింటింగ్స్ చాలా అపురూపంగా వున్నాయి. అందులో "రావి ఆకు మీద పడుకొని, కేరింతలు కొడుతున్న చిన్నికృష్ణుడి" ఆర్ట్ చాలా బాగుంది. అది వేలల్లో ఖరీదు చేస్తుంది. అయినా ఎంతో ముచ్చటపడి తీసుకుంది. ఆ రోజు డబ్బు పలుకుపడి వున్న మరో స్నేహితురాలు అదే చిత్రం కావాలంది.

"స్వప్నా! నువ్వు తీసుకొన్నదే ఆవిడా కావాలంటోంది. మరొకటి లేదు. అయినా ఇది చాలా ఖరీదు... నీకు ఇంకొకటి చిన్నది తక్కువ ధరది ఇస్తాను" అని ఆవిడముందే అంటుంటే నమ్మలేకపోయింది.

"ఇది మా స్వప్న తీసుకుందండీ, వేరేది తీసుకోండి... అంటుందనుకుంది గానీ ఉష అలా అంటుందని ఊహించలేకపోయింది. మనసు చాలా బాధపడింది. అవమానంతో

వణికిపోయింది. అయినా ఏదో పంతం.

"నేను ఇవ్వను ఉషా. ఇది నాకు కావాలి" అంది.

ఆ సంఘటనతో ఉషలో చాలా మార్పు వచ్చింది. ఢిల్లీ వెళ్లేక కనీసం ఫోను కూడా చెయ్యలేదు. ఇన్నాళ్ల స్నేహం ముందు... డబ్బు విలువ అనేక రెట్లు పెరిగిపోయింది. అలా అనుకుంటే మనసంతా చేదుగా అయిపోయింది. నలుగురి ముందూ అవమానం... ఎంతో అపురూపమైన స్నేహం... రెండు విషయాలూ స్వప్నకి మనశ్శాంతి లేకుండా చేసాయి.

ఎంతో అందమైన ఆ చిత్రంలో కళా వైభవం, నైపుణ్యతా కనిపించలేదు. పదే పదే స్నేహితురాలి మాటలే గుర్తుకొస్తున్నాయి.

బైక్ ఆగేదాకా ఎంత వద్దనుకుంటున్నా ఆలోచనలు ముసురుకొంటూనే ఉన్నాయి.

రమేష్ బండి ఆపి, దిగు... అనే వరకూ గమనించలేదు - ఎటు వస్తున్నారో కూడా. లోపలికి వెళ్తూంటే గమనించింది... అది అనాధ బాలల ఆశ్రమం...

ఆ రోజు అక్కడ వున్న కొంతమంది పిల్లలు వేసిన చిత్రాల ప్రదర్శన... బంతిపూల తోరణాలు కట్టి అమాయకంగా ఆహ్వానిస్తూంటే మనసు తేలికపడింది. అందర్నీ అభిమానంగా చేతిలో ఒక బంతిపువ్వు పెట్టి ఆదరంతో చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారు...

అంతా పది పదిహేను సంవత్సరాల లోపు వయసున్న పిల్లలు...

ఒక్కో చిత్రం అద్భుతంగా వేసారు. తెల్లటి షీట్ మీద పెన్సిల్‌తోను, 'చార్‌కోల్'తోనూ వేసారు. గీసిన చిత్రాలలో ప్రతి స్ట్రోక్ సున్నితంగా. ప్రతి కదలకనీ అతి శ్రద్ధగా మలచారు... పువ్వు గీసినా, కిటికీ పరదాలు వేసినా ప్రతీదాంట్లో సహజత్వం ఉట్టిపడుతోంది... అద్భుతమైన కళా ప్రదర్శన...

అన్నింటిలోకీ పదిసంవత్సరాల పిల్లవాడు వేసిన "బతుకు చిత్రం" చాలా బాగుంది. చెట్టు కింద గుడ్డ ఉయ్యాలలో ఊగుతున్న పసివాడు. సగం పచ్చదనం, సగం ఎండిపోయిన చెట్టూ, ఊయలలో నుంచి ఆడుకుంటూనే పసివాడు తలంతా బయటికి పెట్టి, చెట్టువైపు చూస్తూ కేరింతలు కొడుతున్నాడు. పచ్చదనం, ఎండిపోయిన ఆకులు చక్కగా చిత్రీకరించాడు. పిల్లవాడి నవ్వులో ప్రతికదలకలోనూ సహజత్వం ఉట్టిపడింది. పెన్సిల్‌తో వేసిన స్ట్రోక్స్, ప్రతి చిన్న గీతనీ సహజత్వానికి దగ్గరగా నిలబెట్టాయి... చూస్తూ వుండిపోయింది... నిజంగా అక్కడ చెట్టు, ఉయ్యాల, పసివాడు వున్నట్లు అనిపించింది... మురిసిపోయింది. పదేళ్ల పిల్లవాడిలో ఇంత నైపుణ్యమా?... "ఇదే భగవంతుడి వరం అంటే"...

ఆ చిత్రం గీసిన అబ్బాయి మొఖంలో ఆందోళన... వాడికి దగ్గరగా వెళ్లి ఆప్యాయంగా దగ్గరకి తీసుకుంది. "నువ్వీ చిత్రాన్ని చాలా బాగా వేసావు - ఇంత చిన్న వయసులో... నిజంగా నాకు చాలా నచ్చింది" అంది స్వప్న సంతోషంతో.

నిజంగానా మేడమ్. ఇది మా తమ్ముడి బొమ్మ...

"మా తమ్ముడ్ని ఉయ్యాల్లో వేసి మా అమ్మ రోడ్డు పనికి వెళ్లేది... మా అయ్యది కూడా అదే పని... ఒకసారి పక్కూర్లో పని వుందంటూ అందరూ ట్రాక్టరు ఎక్కి వెళ్లారు.. నేను అప్పుడు ఊర్లో కొత్త సినిమా వస్తే దానికి వెళ్లాము... ●

ట్రాక్టరు గోదారి కాలువలో పడిపోయింది. అందరూ చనిపోయారు. అమ్మ, తమ్ముడు గోదార్లో మునిగిపోయారు. మా ఊరి మాష్టారుగారే నన్ను ఇక్కడికి తెచ్చారు" అన్నాడు వాడి చిన్ని కళ్లల్లో తడి... బాధ...

వాడి మాటలు వింటూంటే హృదయం కదిలిపోయింది.

ఇంత చిన్న వయసులో ఇంత కష్టమా? కళ్లు చమర్చాయి.

వాడు వేసిన చిత్రాన్ని తీసుకొన్నాను... ఆ చిత్రం ఖరీదు కన్నా ఎక్కువగా వంద రూపాయల నోట్లు వాడిచేతిలో వుంచాను. వందనోట్లు చూసుకుంటూ 'థాంక్స్ మేడమ్' అంటూ కాళ్ల మీద పడిపోయాడు.

వాడ్ని లేవదీస్తూ... 'ఎందుకురా ఇంత కృతజ్ఞత. నువ్వు గీసిన చిత్రం ముందు ఈ రూపాయలు ఎంత? అనుకున్నాను'. వాడ్ని దగ్గరకు తీసుకొని "నీకు ఏ సహాయం కావాలన్నా అడుగు" అంటూ ధైర్యం చెప్పాను. ఎంతో సంతృప్తితో రమేష్, నేనూ ఇంటికి వచ్చాము.

ఇంటికొచ్చాక స్నేహితురాలి "తాంజార్ పెయింటింగ్" గోడ మీద నుంచి తీసి పక్కన పెట్టాను.

"ఏమిటిది స్వప్నా? ఈ పెయింటింగ్ ఎందుకు తీస్తున్నావు?" అని అడిగాడు రమేష్... కింద పెట్టిన 'తాంజార్' పెయింటింగ్‌ని చేతుల్లోకి తీసుకుంటూ.

"నువ్వు కూడా నీ స్నేహితురాల్లాగే సంకుచితంగా ఆలోచిస్తున్నావు... నిన్ను బాధ పెట్టింది, అవమానించిందీ నీ స్నేహితురాలు. ఈ చిత్రం కాదుగా?..."

కానీ ఎందుకో రమేష్ ఎంత సర్దిచెప్పినా, జరిగిన అవమానాన్ని మరచిపోలేకపోతున్నాను.

"ఆలోచనలు, అవమానాలు పక్కన పెట్టి చూడు. ఇందులో వున్నవాళ్లిద్దరూ పసివాళ్లే. ఒకటి బతుకు చిత్రం, ఇంకొకటి బంగారు చిత్రం. రెండిటికీ తేడాలు తెలియని పసివాళ్ల చిరునవ్వులు చూడు. వాళ్లల్లో స్వార్థం వుందా? పెన్సిల్‌తో గీసినా బంగారు రేకులు అద్దినా ఇద్దరి నవ్వుల్లో తేడా వుందా...? వాళ్ల నవ్వులు వెన్నెలంత స్వచ్ఛంగా లేవూ?... వెన్నెలకి స్వార్థం వుందా? పూరి గుడిసెమీద, పాలరాతి మహల్ మీదా ఒకేలా వెన్నెల పరదాలు జాలు వారుస్తుంది. ఇదీ అంతే. పసివాళ్ల చిరునవ్వులకి ఖరీదు కట్టకు".

రమేష్ మాటల్లో ఎంతో ఓదార్పు. నిజంగానే తాను చాలా స్వార్థంగా ప్రవర్తించింది... మనసుపెట్టి కళని అభిమానించలేకపోయింది. ఎందుకో తన ప్రవర్తన తనకే సిగ్గు కలిగించింది.

లేమినేట్ చేసి వచ్చాక ఆ 'బతుకుచిత్రం' ఇంకా స్వచ్ఛంగా, ఎంతో సహజంగా కనిపించింది.

రెండు పెయింటింగ్‌లూ హాలులో గోడకి అలంకరించబడ్డాయి. ఇద్దరి పసివాళ్ల చిరునవ్వులు, కేరింతలూ నిస్వార్థంగా ఆ గదినంతా పరుచుకొన్నాయి. ●

## టెలిఫోన్ మేనర్స్

అత్యవసరమైతే తప్ప ఉదయం 9 గంటలకు ముందు, రాత్రి 9 గంటల తరువాతా వ్యాపారానికి సంబంధించిన ఫోన్‌లు చేయకండి. వ్యాపారానికి సంబంధించిన ఫోన్‌లు వీలైనంత వరకూ వ్యాపార పనివేళలలో మాత్రమే చేయండి.